
ఈనాడు నిజామాబాద్
మంగళవారం అక్టోబరు 22, 2024

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నిజామాబాద్ రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రూ.500లకు సిలిండర్ రావడం లేదని చాలా మంది తన దృష్టికి తెచ్చారని, నగరంలో 30 రోజుల్లో ప్రత్యేకంగా సర్వే చేయాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో జాప్యం ఉండొద్దన్నారు. ఒకవేళ దరఖాస్తు తిరస్కరిస్తే కారణం లబ్ధిదారుడికి తెలియజేయాలన్నారు. జిల్లాకు ఇంజినీరింగ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, 20, 21 ప్యాకేజీ పనుల పూర్తికి చొరవ చూపుతానన్నారు. మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నిజామాబాద్‌ను స్మార్ట్‌సిటీగా ప్రకటిస్తే రూ.కోట్లల్లో నిధులొస్తాయని, ఎంపీ అర్వింద్ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కోసం వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని, ప్రతి కార్యకర్త 100 ఓట్లు నమోదు చేయించాలన్నారు. ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నాయకులు మధుయాస్కీగౌడ్, ఈరవత్రి అనిల్, తాహెర్, మానాల మోహన్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, అరికెల నర్సారెడ్డి, గడుగు గంగాధర్, రత్నాకర్, ఏ.లలిత, సుజాత పాల్గొన్నారు.



కేశ వేణును కుర్చీలో కూర్చోబెడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, మధుయాస్కీ తదితరులు

పదేళ్లలో అప్పులే మిగిల్చారు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: భారాస నేతలు పదేళ్ల పాలనలో అప్పులే మిగిల్చి వెళ్లారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. జిల్లా కేంద్రం నుడా (నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ) కార్యాలయంలో ఛైర్మన్‌గా కేశ వేణు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. భారాస పాలనలో ఉద్యోగాలు ఇవ్వకుండా నేడు నిరుద్యోగులు, గ్రూప్-1 అభ్యర్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారాస అనుకూల మీడియా సంస్థలు, సామాజిక

ఆడిటోరియం ఆధునికీకరణకు రూ.50 లక్షలు

రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆధునికీకరణకు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పనుల అంచనాలు రూపొందించాలని చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు బడ్జెట్ పెంచాలని ప్రభుత్వం యోచిస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. జిల్లా అభివృద్ధికి పార్టీలకతీతంగా పని చేయాలని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. నగరాభివృద్ధికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఛైర్మన్ రాజీవ్‌గాంధీ హన్మంతు, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార సంఘాల ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా : కేశ వేణు, నుడా ఛైర్మన్

పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని నగరాభివృద్ధికి కృషి చేస్తా. నుడా పరిధిలోని గ్రామాలతో పాటు అర్బన్ అభివృద్ధిపై విజన్‌తో పనిచేస్తా. రాబోయే 30 ఏళ్ల పరిస్థితిని అంచనా వేసి తదనుగుణంగా ప్రణాళికలు అమలు చేస్తాం. ప్రజలకు అందుబాటులో ఉంటా. నాకు పదవి దక్కేలా కృషి చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులకు కృతజ్ఞతలు.

మోస్తరు వర్షం.. తడిసిన ధాన్యం

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడింది. మధ్యాహ్నం ఒక్కసారిగా పడటంతో కల్లాలపై రోడ్లపై ఆరబోసిన వడ్లు, మొక్కజొన్న తడిసి ముద్దయింది. తాటిపత్రులు కప్పి రక్షించుకునేందుకు రైతులు తంటాలు పడ్డారు. అత్యధికంగా సిరికొండ మండలం చీమన్‌పల్లిలో 39.8 మి.మీ. పడింది. సాలూరాలో 36.3, పోతంగల్‌లో 23.5, గూపన్‌పల్లిలో 22.3, ఇజ్రాన్‌పల్లిలో 18.8, చిన్నమావందిలో 18.3, కోటగిరిలో 9.5, బెల్లాల్‌లో 9.0, రెంజల్‌లో 7.8, కల్లూరులో 6.3 మి.మీ. కురిసింది.



రెంజల్‌లో రోడ్డుపై ఆరబోసిన వడ్ల దుస్థితి

కుయ్.. కుయ్.. రాదోయ్

● 33 మండలాలకు ఉన్నది 18 అంబులెన్సులే
● ఏడాదిలో మృతులు 256.. క్షతగాత్రులు 582 మంది

న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం, నిజామాబాద్ వైద్యవిభాగం

జనాభాకు అనుగుణంగా అంబులెన్సు సేవలు అందడం లేదు. జిల్లాలో 33 మండలాలకు 108 వాహనాలు కేవలం 18 ఉన్నాయి. ఘటనా స్థలి 10 కి.మీ. ఉంటే 15 నిమిషాల్లో చేరుకోవాల్సి ఉండగా.. వాహనాల కొరతతో ఆలస్యంగా వెళ్తున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ (మొదటి గంట) అత్యంత కీలకం. సమయానికి ఆసుపత్రుల్లో చేర్చలేక క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఫోన్ వచ్చిన 30 సెకన్లలో వాహనం ప్రారంభమై కి.మీ. 1.5 నిమిషాల వేగంతో చేరుకోవాలి.

మచ్చుకు కొన్ని ఘటనలు

- జిల్లా కేంద్రానికి 30 కి.మీ. దూరంలో ఉన్న అన్నారంపల్లి వద్ద ఇటీవల ఓ వ్యక్తి పురుగుల మందు తాగి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది గంట ఆలస్యంగా వచ్చారు. ఇదేంటని ప్రశ్నిస్తే నిజామాబాద్ నుంచి వచ్చే సరికి ఈ సమయమైందని బదులిచ్చారు.
- ఇందల్వాయి జాతీయ రహదారికి కి.మీ. దూరంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. దర్పల్లి(డీ) గ్రామానికి చెందిన మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో 108కు సమాచారం ఇవ్వగా స్థానికంగా అందుబాటులో లేదు. టోల్‌ప్లాజా అంబులెన్సును పంపించాలని ఎస్సై.. ఐరాడ్ మేనేజర్ విజ్ఞప్తి చేయడంతో గంట ఆలస్యంగా నిజామాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించారు.



దూరం పెరుగుతుండటంతో ఆలస్యం

డిచ్‌పల్లి, భీమ్‌గల్, సిరికొండ, బోధన్, మాక్లూర్, మామిడిపల్లి, ఇందల్వాయి ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ఈ ప్రదేశాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతాయి. ప్రస్తుతం మూడు మండలాలకు ఒక అంబులెన్సు చొప్పున కేటాయించారు. ఓ ఘటనలో క్షతగాత్రులను తరలిస్తుండగా మరోటి చోటు చేసుకోవడంతో ఇతర మండలానికి కేటాయించిన 108పై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఒక్కో వాహనం నెలకు సగటున 150 నుంచి 200 ప్రమాదాలను కవర్ చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రం నుంచి పంపుతుండటంతో దూరం పెరిగి ఆలస్యంగా చేరుకుంటున్నాయి. నగరానికి నాలుగు వాహనాలు కేటాయించినా ఇక్కడ తరచూ ఏదో ఘటన జరుగుతూనే ఉంటుంది.

డ్రైవర్లకు భోజనం చేసే సమయం లేదు

- శ్రీకాంత్, 108 జిల్లా ఇన్‌ఛార్జి

ప్రమాదాలు పెరగడంతో ప్రస్తుతం అంబులెన్సు డ్రైవర్లకు కనీసం భోజనం చేసే సమయం దొరకడం లేదు. జిల్లా అధికారులు ఇటీవలే ప్రమాదాలపై ఆరా తీశారు. త్వరలో మండలానికి ఒక వాహనం కేటాయించే అవకాశం ఉంది.

జిల్లా కమిటీలో చర్చ

2011 జనాభా ప్రాతిపదికన అంబులెన్సులు కేటాయించారు. ప్రస్తుత అవసరాలకు ఇవి సరిపోవడం లేదని అధికారులు గుర్తించారు. ఇటీవల పాలనాధికారి నేతృత్వంలో పోలీసు, రవాణా, వైద్యారోగ్య, రెవెన్యూ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రమాదాలు, నివారణ చర్యలు, క్షతగాత్రులకు త్వరితగతిన అందాల్సిన సేవలపై చర్చించారు.

ఆసుపత్రిలోనూ జాప్యం

అంబులెన్సు సిబ్బంది ఆసుపత్రికి తెచ్చిన క్షతగాత్రుడిని వైద్యులు, అక్కడి సిబ్బందికి అప్పగించాలి. సంబంధిత ఆసుపత్రి పోలీస్ బూత్ కానిస్టేబుల్‌కు సమాచారం ఇవ్వాలి. అంతకుముందే బాధితుడిని లోపలకు తరలించేందుకు స్ట్రెచర్ ఉండాలి. జీజీహెచ్‌లో స్ట్రెచర్స్, వీల్‌ఛైర్లు లేవు. అంబులెన్సు డ్రైవర్లకు ఇది కొంత ప్రతిబంధకంగా మారింది. ఇటీవల ఓ వ్యక్తి ఆటోలో జీజీహెచ్‌కు వచ్చినా అరగంట స్ట్రెచర్ రాకపోవడంతో ఆలస్యంగా సేవలంది మృతి చెందడం గమనార్హం.

విదేశాల్లో ఇలా..

2022లో ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన అంబులెన్సు సేవలు అందించి యూఏఈ గిన్నిస్ రికార్డ్ నమోదు చేసింది. గంటకు 395 కి.మీ. వేగంతో క్షతగాత్రులను ఆసుపత్రులకు చేర్చారు. ఒకేసారి వందకు పైగా బాధితులను తీసుకెళ్లే సామర్థ్యమున్న వాహనాలు వారి సొంతం. ● అత్యంత వేగంగా స్పందించే దేశాల్లో జపాన్, అమెరికా, ఇంగ్లాండ్ ముందు వరుసలో ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన పూర్తిస్థాయి ప్రమాణాలతో వాహనాలు కేటాయిస్తారు. ట్రాఫిక్ అంతరాయం లేకపోవడంతో త్వరగా క్షతగాత్రులను ఆసుపత్రులకు చేరుస్తారు.

తండ్రిని ఉరేసి చంపిన తనయుడు

అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా గుర్తించిన బంధువులు

నవీపేట, న్యూస్‌టుడే : వివిధ కారణాలు, పాతకక్షలతో కన్న తండ్రిని తనయుడే కడతేర్చిన ఘటన నవీపేట మండలం అనంతగిరిలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నార్త్ రూరల్ సీఐ సతీష్‌కుమార్, ఎస్సై వినయ్, గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరు అమృతం (54) పారిశుద్ధ్య కార్మికుడు. మహిపాల్, మనోజ్ కుమారులు. 20 ఏళ్ల కిందట భార్య లక్ష్మి ఇంటి నుంచి వెళ్లిపోయి మాక్లూర్ మండలం గొట్టుముక్కులలో కుమారులతో కలిసి ఉంటున్నారు. బతుకుదెరువు నిమిత్తం కొన్నాళ్లు కొడుకులిద్దరు దుబాయి వెళ్లారు. తన తండ్రి చనిపోయాడని చెప్పి పెద్ద కుమారుడు మహిపాల్ పదిరోజుల కిందట అనంతగిరికి వచ్చారు. ఆయన వద్దే ఉంటూ ఎలాగైనా అంతమొందించాలనుకున్నాడు. ఆదివారం రాత్రి తండ్రి కొడుకులిద్దరూ వారింట్లోనే మద్యం తాగారు. మత్తులో ఉన్న మహిపాల్.. తండ్రి మెడకు టవల్‌తో ఉరేసి హత్య చేశాడు. సోమవారం ఉదయం ఏమీ తెలియనట్లుగా ఆర్ఎంపీని రప్పించి ఆరోగ్యం బాగాలేక తండ్రి చనిపోయాడని అతనికి చెప్పాడు. గ్రామస్థులనూ నమ్మించాడు. అమృతం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశాడు. మృతదేహానికి స్నానం చేయిస్తుండగా మెడకు గాయాలు ఉండటంతో అమృతం సోదరి, బంధువులు గుర్తించారు. కుమారుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని విచారించగా తండ్రిని తానే హతమార్చినట్లు అంగీకరించాడు. తల్లితో వేరుగా ఉండటం, తండ్రి నిత్యం మద్యం తాగుతుండటంతో తనకు పెళ్లి కావడం లేదని, తండ్రి ఆస్తులు (ఇల్లు, ప్లాటు), తన గేదె విక్రయించి తల్లి పేరిట ఇల్లు కట్టుకోవాలనే ఉద్దేశంతో హత్య చేశాడని, బంధువుల ఫిర్యాదు మేరకు మహిపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.



అమృతం

జిల్లాకు మరో పదవి

రైతు కమిషన్ సభ్యుడిగా గడుగు



నిజామాబాద్ అర్బన్ : జిల్లాకు మరో నామినేటెడ్ పదవి వరించింది. రైతు కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం ఏడుగురిని నియమించగా అందులో జిల్లావాసి గడుగు గంగాధర్ ఉన్నారు. కమిషన్ ఛైర్మన్‌గా కోదండరెడ్డి ఇది వరకే నియమితులు కాగా.. తాజాగా సభ్యులను నియమించింది. కాంగ్రెస్ సీనియర్ నేత గడుగు గంగాధర్ పార్టీలో పలు పదవులు నిర్వర్తించారు. కార్పొరేటర్‌గా, డీసీసీ అధ్యక్షుడిగా పని చేశారు. జుక్కల్ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. ప్రస్తుతం టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

పరిశోధన, బోధన రంగాల బలోపేతం

తెవివి వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య టి.యాదగిరిరావు

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్

తెలంగాణ విశ్వవిద్యాలయ నూతన వీసీగా ఆచార్య టి.యాదగిరిరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు, మెరుగైన న్యాక్ గ్రేడు, స్నాతకోత్సవం నిర్వహణపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. వర్సిటీ సమస్యలపై 'ఈనాడు'లో 'దశ తిరగాలి.. తెవివి మురవాలి' శీర్షికన వచ్చిన కథనంపై చర్చించారు. '18 ఏళ్ల వర్సిటీ చరిత్రలో ఒక్కసారే స్నాతకోత్సవం నిర్వహించడం బాధాకరం. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతి ఆర్నెల్లకోసారి స్నాతకోత్సవం జరపాలి. సత్వరం స్నాతకోత్సవం నిర్వహించేలా చూస్తా. మెరుగైన న్యాక్ గుర్తింపు కోసం సెల్ఫ్ స్టడీ రిపోర్టు సమర్పించి వసతులు సమకూరుస్తాం' అన్నారు. 'కాకతీయ వర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సుల ఏర్పాటుకు కృషి చేశా. కళాశాల ఏర్పాటు ఆవశ్యకతపై ప్రభుత్వానికి నివేదిస్తా' అని పేర్కొన్నారు. 'సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల సహకారం అవసరం. మెదక్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు తెవివి పరిధిలోకి వచ్చేలా పాటుపడతా. కొత్తగా ఫార్మా సైన్స్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు పెట్టాలనే ఆలోచన ఉంది' అని వీసీ పేర్కొన్నారు. వర్సిటీ భూముల వివరాలు, సమస్యలపై రిజిస్ట్రార్ యాదగిరిని ఆరా తీశారు. 570 ఎకరాల భూమి ఉందని, ఇందులో కొంత కోర్టు కేసు నడుస్తోందని, కలెక్టర్‌కు రాత పూర్వకంగా లేఖ పంపినట్లు రిజిస్ట్రార్ బదులిచ్చారు. మరో మహిళా వసతిగృహ నిర్మాణం కోసం రూసా నిధులున్నాయని టెండర్లు చేపట్టాల్సి ఉందన్నారు. సైన్స్ కళాశాల నిర్మాణం తుది దశకు చేరిందన్నారు. వర్సిటీలో సెనెట్ కమిటీ లేదనే విషయం వీసీ గ్రహించారు. ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థి నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న వీసీ ఆచార్య టి.యాదగిరిరావు

ఈ-నామ్.. కొనుగోళ్లకు ఇబ్బందులు

సర్వర్ పనిచేయక నిజామాబాద్ యార్డులో నిలిచిన విక్రయాలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

నిజామాబాద్ శ్రద్ధానంద్ గంజ్‌లో సోమవారం పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం (ఈ-నామ్) ద్వారానే లావాదేవీల ప్రక్రియ ఉండటంతో ఆన్‌లైన్ సర్వర్ పనిచేయలేదు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి కొనుగోళ్లు, అమ్మకాలు జరగలేదు. సుమారు 800 క్వింటాళ్ల సోయాబీన్, 700 క్వింటాళ్లకు పైగా మొక్కజొన్న యార్డులోనే ఉండిపోయింది. మధ్యాహ్నం నుంచి భారీ వర్షం రావడంతో రైతులు అవస్థలు పడ్డారు. తెచ్చిన సరకు తడిసిపోకుండా కాపాడుకునేందుకు అన్నదాతలు ఇబ్బందులుపడ్డారు. మంగళవారం రోజైనా ఈ-నామ్ సాఫ్ట్‌వేర్ పనిచేస్తుందో? లేదోనని ఇటు అన్నదాతలు, అటు అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణను 'న్యూస్‌టుడే' సంప్రదించగా దేశవ్యాప్తంగా సోమవారం పోర్టల్ పనిచేయలేదని, నిలిచిపోయిన వ్యవసాయోత్పత్తులను తిరిగి కొంటామని, సరకు తడవకుండా గోదాములిచ్చామని, అవసరమైన తాటిపత్రులు సమకూర్చామని చెప్పారు.



యార్డులో మక్కలను నేర్పుతున్న హమాలీలు

క్షేత్రస్థాయి ఒత్తిళ్లు నివేదిద్దాం

కొనుగోళ్లపై అంతర్గత సమీక్ష

ఈనాడు, నిజామాబాద్

ధాన్యం కోతలు ఊపందుకున్నా కొనుగోళ్లపై స్పష్టత లేదు. మరోవైపు కోసిన వడ్లు ఆరబెట్టాలంటే ప్రతికూల వాతావరణం ఉంది. మరోవైపు ప్రైవేటులో విక్రయిస్తే రూ.500 బోనస్ నష్టపోతామనే ఆందోళన. కేంద్రాలు తెరుస్తున్నా.. తూకాలు వేయకపోవటంతో ఎటూ పాలుపోని స్థితి అన్నదాతలది. కొనుగోలు కేంద్రాలు తెరవాలని బోధన్ డివిజన్‌లో రోడ్లెక్కుతున్నారు. మిగతా డివిజన్లలోనూ కోతలు మొదలవుతున్నాయి. దీంతో అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. క్షేత్రస్థాయి పరిస్థితి ఉన్నతాధికారులకు నివేదించాలని నిర్ణయించుకున్నారు. సోమవారం పంట కోతల పరిస్థితిపై అంతర్గత సమీక్ష నిర్వహించారు.

అవరోధాలపై అవలోకనం..

ప్రస్తుతం వాతావరణంలో మార్పులు ప్రతికూలంగా మారాయి. పంటను ఆరబెట్టి ప్రమాణాల మేరకు తీసుకొస్తేనే కాంటా వేయాల్సిన పరిస్థితి. తూకం వేసిన బస్తాలను ఏరోజుకారోజు మిల్లుకు తరలించి.. సదరు యజమాని గోదాముల్లో దించేవారు. కానీ, ఈ ఏడాది ఇంకా మిల్లర్ల విషయంలో నిర్ణయం జరగలేదు. తాజా సమీక్షలో మిల్లర్లూ పాల్గొని తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. పౌరసరఫరాల సంస్థ, మిల్లర్లకు మధ్య ఒప్పందాలకు విధివిధానాల విషయంలో ప్రస్తుతం ప్రతిష్టంభన నెలకొంది. కొనుగోలు ప్రారంభం కాకపోవటానికి ఇదీ ఒక కారణమే. సీఎంఆర్ ధాన్యం ఎగవేతలను నివారించేందుకు మిల్లర్ల నుంచి నూరుశాతం బ్యాంకు పూచీకత్తు విధానం తేవాలని ప్రభుత్వం ఆలోచన చేయగా.. మిల్లర్లు అభ్యంతరం తెలుపుతున్నారు. గత విధానమే కొనసాగించాలని కోరుతున్నారు. క్వింటా వడ్లకు 67 కిలోల బియ్యం ఇవ్వటం కుదరదని..నూక శాతం అధికంగా ఉంటుందనే వాదన వినిపించారు. 60 కిలోల బియ్యం, మిగతావి నూకలు ఇస్తామన్నట్లు తెలుస్తోంది.

బోనస్ ప్రకటనతో ప్రాధాన్యం

ఈ సీజన్ నుంచే సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇందుకు విధివిధానాలు ఖరారు కాలేదు. సన్నాల నిర్ధారణకు పరికరాలూ కొనుగోలు చేస్తున్నారు. కానీ, ఎకరానికి ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేయాలి? కౌలు రైతు నుంచి వచ్చే ధాన్యం విషయంలో ఎలా ముందుకెళ్లాలి? ఏమైనా పరిమితులు విధిస్తారా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.

నేడు సీఎం వద్దకు..

జిల్లాలో 11.5 లక్షల మె.ట దిగుబడి రావొచ్చనేది అంచనా. సన్నాలు 8.5 లక్షల మె.ట. వచ్చే అవకాశం ఉంది. విడివిడిగా సేకరించాలని ఇప్పటికే యంత్రాంగం కసరత్తు చేసింది. కానీ, విధివిధానాల పరంగా తీసుకొనే నిర్ణయాలపై మార్పులు, చేర్పులు ఉంటాయి. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లపై ఒక నివేదిక తయారు చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి సమక్షంలో మంత్రులు, పౌరసరఫరాల సంస్థ అధికారులు ధాన్యం సేకరణపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి పిలుపందినట్లు తెలిసింది. జిల్లాలో పరిస్థితులపై అధికారులు ఆయనకు సోమవారం సాయంత్రం నివేదిక అందించారు.



జలమయమైన రైల్వేస్టేషన్ - బస్టాండు రోడ్డు

వాన దంచె..
రోడ్లు పొంగె

నిజామాబాద్ నగరంలో సోమవారం మధ్యాహ్నం జోరుగా వర్షం కురిసింది. సుమారు గంట పాటు దంచికొట్టడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రైల్వేస్టేషన్ ఆవరణ, బస్టాండుకు వెళ్లే ప్రధాన రోడ్డుపై వరద పారింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు.

– ఈనాడు, నిజామాబాద్

వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు

కోటగిరి, న్యూస్‌టుడే: ఆలస్యంగా వరి నాట్లు వేసుకున్న ప్రాంతాల్లో పూత దశ నుంచి గింజ పాలు పోసుకునే దశలో ఉన్నాయి. ఆలస్యంగా వేసుకున్న పంటలపై తెగుళ్లు, సుడిదోమ ఉద్ధృతి తీవ్రంగా ఉంది. తెగుళ్లు, సుడిదోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రుద్రూర్ వరి, చెరకు పరిశోధన కేంద్రం అధిపతి డా.బాలాజీనాయక్ వివరించారు.



సుడిదోమ లక్షణాలు : ఈ పురుగులు మొక్క మొదళ్లలో నివాసం ఏర్పరుచుకుని రసాన్ని పీలుస్తుండటంతో ఆకులు నారింజ, పసుపు రంగుకి మారి ఆ తర్వాత గోధుమ రంగులోకి మారుతాయి. క్రమేపీ పైరు సుడులు సుడులుగా ఎండిపోయి మొక్క చనిపోతుంది.

యాజమాన్యం: పిల్ల, పెద్ద పురుగులు కలిపి దుబ్బుకు 20-25 దోమలు ఉన్న దశలో డైనోటెఫ్యూరాన్ 0.4గ్రా. లేదా పైమెట్రోజైన్ 0.6గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.47మి.లీ లేదా ఎథిప్రోల్, ఇమిడాక్లోప్రిడ్ 0.25గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కూరగాయలు.. ఆదాయ మార్గాలు

న్యూస్‌టుడే, పొతంగల్

కూరగాయల సాగులో లాభాలు గడిస్తున్నారు పొతంగల్‌కు చెందిన రైతు సూదం విఠల్. మంజీర పరివాహక ప్రాంతంలో 5ఎకరాలు కౌలుకు తీసుకుని చిక్కుడు, గోబీ, బీర, కాకర వంటివి పండిస్తున్నారు. 70 రోజుల్లో చేతికందే పంటలు ఎంపిక చేసుకుని ఆదాయం పొందుతున్నారు.



చిక్కుడులో అంతర పంటగా గోబీ

తీగ చిక్కుడు, గోబీ: 30 గుంటల విస్తీర్ణంలో తీగ చిక్కుడు సాగు చేశారు. అంతర పంటగా గోబీ వేశారు. రూ.50 వేలు ఖర్చు చేసి జులైలో చిక్కుడు విత్తుకోగా సెప్టెంబరు నుంచి దిగుబడి ప్రారంభమైంది. ప్రస్తుతం 2.5 క్వింటాళ్ల చిక్కుడును మార్కెట్‌లో విక్రయించగా రూ.13 వేలు లాభం వచ్చింది. పంట పూర్తయ్యే వరకు రూ.1.5లక్షల ఆదాయం రావచ్చని అంచనా. జులైలో గోబీ నాటగా అక్టోబరు మొదటి వారంలో కోత పూర్తయింది. రూ.1.6 లక్షల ఆదాయం వచ్చింది. పెట్టుబడి రూ.75 వేలు పోనూ రూ.85 వేల లాభం సమకూరింది.

బీర: ఒక ఎకరంలో బీర సాగు చేపట్టారు. జూన్‌లో పంట విత్తుకోగా సెప్టెంబరు నుంచి కోత ప్రారంభమైంది. నేటి వరకు 40 క్వింటాళ్ల బీర కాయలను మార్కెట్‌లో విక్రయించగా రూ.1.6 లక్షల ఆదాయం సమకూరింది. పంట చివరి దశలో ఉన్నందున మరో సుమారు రూ.30 వేలు రావొచ్చని అంచనా. పెట్టుబడి రూ.లక్ష పోనూ రూ.90 వేలు ఆదాయం వచ్చింది.

కాకర: 20 గుంటల్లో కాకర సాగు చేశారు. జూన్‌లో పంట విత్తుకోగా సెప్టెంబరు నుంచి పంట చేతికొచ్చింది. నేటి వరకు ఒక టన్ను కాకర కాయలను మార్కెట్‌కు తరలించగా రూ.60 వేలు వచ్చాయి. పంట ఇంకా వస్తున్నందున అదనంగా మరో రూ.20 వేలు రావచ్చని అంచనా. పెట్టుబడి రూ.30 వేలు పోనూ రూ.50 వేలు లాభం గడించారు.

ఒకే రకం కాకుండా

- సుదాం విఠల్, పొతంగల్



ఒకే రకమైన పంట సాగు చేస్తే ఆదాయం వస్తుందన్న నమ్మకం ఉండదు. పలు రకాల పంటలు సాగు చేస్తే ఒక దాంట్లో కాకున్నా మరో దాంట్లో లాభం చేకూరవచ్చు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేపడితే లాభాలు వస్తాయి.

సరిహద్దుపై నిఘా

న్యూస్‌టుడే, కోటగిరి

● ధాన్యం అక్రమ రవాణా కట్టడికి అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాల ఏర్పాటు



పరిశీలన

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మన రాష్ట్రంలో రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ప్రకటించింది. మహారాష్ట్రలో ఈ అవకాశం లేకపోవడంతో ఆ రాష్ట్ర రైతులు పండించిన ధాన్యాన్ని తీసుకొచ్చి ఇక్కడి కర్షకుల పేరిట ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే అవకాశాలున్నాయి. గతంలోనూ ఈ విధంగా తీసుకొచ్చిన ఉదంతాలు సైతం వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి పంట ఉత్పత్తులు రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలొచ్చాయి. దీంతో వారు ధాన్యం అక్రమ రవాణా నియంత్రణకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా వ్యవసాయ, ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన సాలూర, పొతంగల్, కందకుర్తి వద్ద అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పొతంగల్‌లో ఆరుగురు అధికారులు..



పొతంగల్ తనిఖీ కేంద్రంలో విధుల నిమిత్తం వ్యవసాయ, ఎక్సైజ్‌శాఖలకు సంబంధించి ఒక అధికారి చొప్పున, రెవెన్యూశాఖకు సంబంధించి ఇద్దరు వీఆర్‌ఏలు, ఇద్దరు పోలీసు అధికారులను నియమించారు. వీరు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారు. పొతంగల్‌కు మహారాష్ట్ర గ్రామాలు కేవలం 12 కి.మీ దూరంలో ఉండటంతో అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. వానాకాలం సీజన్, మహారాష్ట్ర ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయి. అక్రమాలకు పాల్పడి తనిఖీల్లో పట్టుబడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, పొతంగల్**

కందకుర్తిలో..

కందకుర్తి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్‌శాఖల నుంచి ముగ్గురేసి సిబ్బంది రోజుకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తుండగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై ఈ.సాయన్న పర్యవేక్షిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్నంగా తనిఖీ చేసిన తర్వాతే వదులుతున్నారు. రెండు రోజుల కిందట కందకుర్తి వద్ద తాత్కాలిక చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. **- న్యూస్‌టుడే, రెంజల్**



రైతేరాజు

కాటుక, మెడవిరుపు తెగులు లక్షణాలు : కాటుక తెగులు పూత దశలో ఆశిస్తుంది. అధికంగా ఆశిస్తే శిలీంధ్రం పెరగడంతో గింజ ఆకుపచ్చ ముద్దగా తయారై పసుపు రంగులోకి మారి చివరకు నల్లబడుతుంది. మెడవిరుపు తెగులు గింజ గట్టిపడే దశలో ఆశిస్తుంది. ఈనిన దశలో మెడపైన నల్లని మచ్చలు ఏర్పడి కంకులకు పోషకాలు అందకపోవడంతో మెడలు విరిగి కంకులు వేలాడుతుంటాయి. తద్వారా గింజలు తాలు పోతాయి.

యాజమాన్యం: ఈనిక దశలో ఉన్న వరి పంటలో ఈ రెండు తెగుళ్లు సోకే ఆస్కారం ఉంది. నివారణకు టెబ్యుకొనజోల్, ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 80గ్రా. లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మెడవిరుపు తెగులు లక్షణాలను గింజ పాలు పోసుకునే దశలో గమనిస్తే ఐసోప్రోథయోలిన్ 320మి.లీ లేదా అజిక్సోస్ట్రోబిన్, ట్రైసైక్లోజోల్ 200 మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలి.

ఉల్లిసాగుకు ఇదే సమయం



న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం : ఉల్లికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వినియోగం పెరుగుతుండటంతో ధరలు కూడా నిలకడగా ఉంటున్నాయి. సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. మంచి లాభాలు గడించొచ్చని బోధన్ డివిజన్ ఉద్యానాధికారి వహిద్ జమా తెలిపారు. నవంబరులోగా విత్తుకునే అవకాశం ఉంది. ఉల్లిసాగుకు ఎకరాకు మూడు, నాలుగు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నేలను బాగా దున్ని 120సెం.మీ వెడల్పు, 15సెం.మీ ఎత్తు ఉండేలా నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు కిలోల విత్తనం 200చ.మీ. నారుమడికి సరిపోతుంది. విత్తనశుద్ధి తప్పనిసరి. 3గ్రా. కాప్టాన్ లేదా థైరమ్ కిలో విత్తనానికి కలిపి నారుమడిలో పలుచగా వరుసల్లో పోయాలి. నారుమళ్లలో తెగులు సోకకుండా పది రోజులకోసారి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారుకు పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి. నాటిన 75రోజుల తర్వాత మాలిక్ హైడ్రాజైడ్ 2.5గ్రా. లీటర్ నీటికి ద్రావణాన్ని చల్లడంతో మొలక నష్టం బాగా తగ్గుతుంది. నారు నాటిన వంద రోజులకు కార్బండజిమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కుళ్లడం చాలా వరకు తగ్గుతుంది. ఎకరాకు 10టన్నుల పశువుల ఎరువుతో పాటు 80కిలోల నత్రజని, 30కిలోల భాస్వరం, 24కిలోల పొటాష్ వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండివేసి మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది. ఉల్లి నాటిన 60 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో ఏడు, ఎనిమిది తడులివ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు కట్టడం ఆపివేయాలి. వానాకాలం ఎకరానికి 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో 130 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు.

రైతు ప్రశ్న సమాధానం

టమాటా పంటలో కాయతొలుచు పురుగు నివారణ తెలుపగలరు? - శంకర్, రైతు, పొతంగల్

సూది పురుగు టమాటాలో సుమారు 20-80శాతం నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు ఎకరాకు 4-5 లింగాకర్షక ఎరలు ఏర్పాటు చేసుకోవాలి. పురుగు ఆశించిన కాయలు, పండ్లను ఏరి కాల్చి వేయాలి. క్లోరాంట్రనిలిప్రోల్ 18.5శాతం ఎస్.సి. 0.2మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

- డా.రాజ్‌కుమార్, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, రుద్రూర్

సాలూరలో సరిపడా లేని సిబ్బంది..!

బోధన్, సాలూర మండలాల్లోని తనిఖీ కేంద్రాల వద్ద రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, మార్కెటింగ్‌శాఖల అధికారులు నిత్యం నిఘా ఉంచాలనే ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో ఇంకా కార్యరూపం దాల్చలేదు. సాలూర వద్ద ఓ గుడారం లాంటి టెంట్ వేయగా.. అది సోమవారం కురిసిన వర్షానికి కూలిపోయింది. ‘న్యూస్‌టుడే’ ఫొటో తీసిన విషయాన్ని గుర్తించిన అధికారులు తర్వాత తేరుకుని సరిచేశారు. ఈ కేంద్రంలో నాలుగు ప్రభుత్వశాఖల తరఫున సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం ఓ వీఆర్‌ఏ, ఒక కానిస్టేబుల్ మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖలకు చెందిన సిబ్బంది కనిపించలేదు. ఈ విషయంపై సాలూర తహసీల్దార్ శశిభూషణ్‌ను ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా అన్నిశాఖలకు చెందిన సిబ్బందితో 24గంటల పాటు తనిఖీ కేంద్రం నిర్వహిస్తున్నామని చెప్పారు. బోధన్ మండలం ఖండ్‌గాం వద్ద కూడా సరైన పర్యవేక్షణ లేదు.

- న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం



గుడారాన్ని సరిచేస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

24న విద్యుత్తు శాఖ బహిరంగ విచారణ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: టీజీ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందని ఆ శాఖ జిల్లా ఎస్ఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ) ఛైర్మన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు మనోహర్ రాజు(టెక్నికల్), బండారు కృష్ణయ్య(ఫైనాన్స్) హాజరవుతారని చెప్పారు. విద్యుత్తు శాఖలో టారిఫ్‌కు సంబంధించి ఏవైనా పొరపాట్లు, కేటగిరీ మార్పులో ఇబ్బంది కలిగితే ఆయా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

బీసీలను సంఘటితం చేయాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి బీసీలను సంఘటితం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఆయన మాట్లాడారు. బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, సమగ్ర కులగణన త్వరగా ప్రారంభించాలని డిమాండు చేశారు. గ్రూప్-1 అభ్యర్థులకు అన్యాయం జరుగుతున్న జీవో 29ని రద్దు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, ప్రధానకార్యదర్శి మురళి, ఉద్యోగుల సంఘం కార్యదర్శి రేవంత్, జస్టిస్ పోతాశెట్టి లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

అత్యాచారం కేసులో అయిదుగురి నిందితుల అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒకటో ఠాణాలో ఇటీవల నమోదైన అత్యాచారం కేసులో అయిదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 18న రాత్రి 10.30 గంటలకు ఆటోలో వచ్చిన నిందితులు ఓ మహిళను బస్టాండ్ ప్రాంతం నుంచి తీసుకెళ్లారు. డిచ్‌పల్లిలోని నాగేపూర్ గేట్ వద్ద ఉన్న సలీం ఇంటి దాబాపైన అత్యాచారం చేశారు. దీనిపై 19న మహిళ ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేయగా సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి దర్యాప్తు చేపట్టారు. నిందితులు మిట్టాపల్లికి చెందిన జైనుద్దీన్ ఖురేషీ(35), ఘన్‌పూర్‌కు చెందిన మోసిన్ ఖురేషీ(35), నడిపల్లికి చెందిన మహమ్మద్ సుల్తాన్ ఖురేషీ(40), డిచ్‌పల్లికి చెందిన నగేశ్(20), నడిపల్లికి చెందిన షేక్ రఫీక్(35)లను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వీరంతా డిచ్‌పల్లి మండలానికి చెందిన మేకల వ్యాపారులని చెప్పారు.

ప్రజా సంబంధాలు ఉన్న వారికే టికెట్లు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: త్వరలోనే వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలిచేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై బస్వాగార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డిగ్రీ పూర్తయిన యువతను ఎక్కువ సంఖ్యలో నమోదు చేయించాలన్నారు. 2018లో ప్రతిపక్షంలో ఉన్నా జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచారని, ఇప్పుడు మనమే అధికారంలో ఉన్నామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 55 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. వాస్తవాలు క్షేత్రస్థాయిలో వివరించాలని చెప్పారు. భారాస హయాంలో విస్మరించిన విద్య, వైద్య రంగాలను మెరుగుపరిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ప్రజలతో సంబంధాలు ఉండి, విజయం సాధిస్తారనే వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. భారాస, భాజపా విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. డిగ్రీ పూర్తయిన వారందరితో నవంబరు 6వ తేదీ వరకు ఓటు నమోదు చేయించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు తాహెర్, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, నాయకులు అరికెల నర్సారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్, నగర అధ్యక్షుడు ప్రీతం, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, విపుల్ పాల్గొన్నారు.



ఓటరు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నేతలు



భూమి పూజ చేస్తున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

న్యాయమూర్తుల వసతి గృహాలకు శంకుస్థాపన

నిజామాబాద్ న్యాయవిభాగం, బోధన్ గ్రామీణం న్యూస్‌టుడే: నిజామాబాద్‌లో 6 బోధన్‌లో 2 న్యాయమూర్తుల వసతి గృహాలకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ వినోద్ కుమార్‌లు వర్చువల్ విధానంలో సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా జడ్జి కుంచాల సునీత న్యాయమూర్తుల వసతి సముదాయంలో భూమిపూజ చేశారు. హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సురేందర్ మాట్లాడుతూ.. కోర్టు చెంతనే వసతి ఉంటే న్యాయమూర్తులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ.. లిఫ్ట్‌లకు కూడా నిధులు విడుదల చేశారన్నారు. మొదటి, రెండో అదనపు జిల్లాకోర్టు జడ్జిలు కనకదుర్గ, టి.శ్రీనివాస్, సీనియర్ సివిల్‌జడ్జి శ్రీకాంత్‌బాబు, జూనియర్ సివిల్‌జడ్జి గోపీకృష్ణ, మెజిస్ట్రేట్ కుష్బు, ఉపాధ్యాయ, చైతన్య, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, జిల్లా కోర్టు పీపీ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవగిరి ఆరుగంటలు ఆలస్యం



ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: దేవగిరి ఎక్స్‌ప్రెస్ సోమవారం ఆరుగంటలు ఆలస్యంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ చేరుకుంది. ముంబయి దాదర్ రైల్వేస్టేషన్ నుంచి ఆదివారం రాత్రి 9.42 గంటలకు ప్రారంభం కావాల్సిన రైలు సాంకేతిక కారణాల వల్ల 12.32 (వేకువ జామున) ప్రారంభమైంది. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు ఉదయం 11.08 గంటలకు రావాల్సి ఉండగా సాయంత్రం 4.26 చేరుకుంది. ఆలస్యం కావడంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు.



క్రీడాకారులతో పీడీ ప్రసాద్

ఫుట్‌బాల్ ఎంపికలు పూర్తి

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాజారాం స్టేడియం సోమవారం అండర్-19 బాలుర విభాగంలో ఫుట్‌బాల్ ఎంపికలు పూర్తయ్యాయని పీడీ ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పీఈటీలు అనిల్, ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు: అనిరుధ్, కెల్విన్ పాల్, కెవిన్ రొనాల్డో, అషేర్, హుస్సేన్, సిద్దిఖీ, రయాన్ అహ్మద్, అఫ్‌నాస్, నిఖిల్, రాజేశ్, అబ్రార్, ఆమీద్, రాజ్‌కుమార్, అనాస్, అయాన్, జావిద్

క్రీడాకారులకు అభినందన

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆర్యసమాజ్ అనుబంధ రాధాకృష్ణ పాఠశాలలో చదువుతున్న ఆరాధ్య ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కార్యదర్శి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుణ్ని అభినందించారు.

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రతిభ చాటిన ధర్మారం(బీ) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులను జోనల్ అధికారిణి ఫ్లోరెన్స్ రాణి సోమవారం అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, చందరంగ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు.



డిచ్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: తొర్లికొండ జడ్పీ పాఠశాలకు చెందిన వనజ, సరితలు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించినందుకు ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు సోమవారం వారిని అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్



అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో విద్యార్థులు, ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలో శంకర్‌భవన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ షానవాజ్, చంద్రజ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరావు తెలిపారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ వీరికి జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవీపేట, న్యూస్‌టుడే: నాగేపూర్‌కు చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు మహిపాల్‌రెడ్డి తల్లి గంగవ్వ (87) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబీకుల ఇంటికి సోమవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వెళ్లి వారిని పరామర్శించారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌ తాహెర్‌ బిన్‌ హుందాన్‌, నిజామాబాద్‌ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌ రాజిరెడ్డి, గడుగు గంగాధర్‌, సునీల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, గోవర్ధన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

కొనసాగుతున్న అన్నదానం

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకోర్టు ఆవరణలో ప్రారంభించిన అన్నదానం 20వ వారం కొనసాగింది. జిల్లా జడ్జి కుంచాల సునీత సోమవారం హాజరై కక్షిదారులకు భోజనం వడ్డించారు. స్పెషల్ కోర్టు పి.పి.రాజారెడ్డి పాల్గొని తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



★★★ సాలూర లోని సాయిన గర్ కాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోయింది. **- లక్ష్మీ, సాలూర**

★★★ ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య కార్మికుల చేత మురుగు కాల్వలను శుభ్రం చేయించారు.

★★★ చంద్రశేఖర్ కాలనీలో రోడ్లు శుభ్రం చేయడం లేదు. చెత్త రోడ్డుపై పేరుకుపోయింది. **- శంకర్, స్థానికుడు**

★★★ కార్మికులను పంపించి శుభ్రం చేసేలా ఏర్పాట్లు చేస్తాం. **-షాదుల్లా, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

★★★ నాల్‌కల్ రోడ్డులో మురుగు కాలువల్లో నుంచి తీసిన చెత్త ఎత్తడం లేదు. **- రాకేష్, స్థానికుడు**

★★★ పూడిక ఎండిన తర్వాత ఎత్తివేయిస్తాం. **- మహిపాల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

★★★ డివిజన్-1 ఖానాపూర్‌లో డ్రైనేజీలోని చెత్త తీసి రోడ్డు పక్కన వేశారు. **-నరేష్, గ్రామస్థుడు**

★★★ సిబ్బంది చేత ఎత్తివేయిస్తాం. **ప్రశాంత్, సానిటరీ ఇన్‌స్పెక్టర్**

★★★ నగరంలోని వినాయక్‌నగర్ మహాలక్ష్మినగర్ కాలనీలో మురుగు కాల్వలు లేవు. ఇళ్లలో నుంచి వెలువడిన నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి మురుగు ఏర్పడటంతో దోమల సమస్య ఏర్పడుతోంది. **- గంగారెడ్డి, స్థానికుడు**

★★★ కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాల్సి ఉంది. నిధులు మంజూరు కాగానే చేపడతాం. **- ఇనాయత్, ఏఈ, జోన్-2, నగరపాలక సంస్థ**

– న్యూస్‌టుడే, సాలూర, నిజామాబాద్ నగరం, నిజామాబాద్ గ్రామీణం నిజామాబాద్ అర్బన్

ప్రజావాణికి 82 అర్జీలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

బాధితులు తమ సమస్యలు విన్నవించేందుకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి తరలివచ్చారు. ఈ మేరకు పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు పాలనాధికారులు అంకిత్, కిరణ్ కుమార్, శిక్షణ ఐఏఎస్ అధికారి సంకేత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, ఇన్‌ఛార్జి డీపీవో శ్రీనివాస్ ప్రజల నుంచి 82 అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై అధికారుల వద్ద మొర పెట్టుకుని పరిష్కరించాలని విన్నవించారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్ డిమాండ్ చేశారు.

★ తమ చుట్టు పక్కల వైన్‌షాపులతో ఇబ్బందవుతోందని కాలూరు గ్రామస్థులు విన్నవించారు. వ్యాధుల బారిన పడుతున్నామని, వీటిని దూర ప్రాంతానికి తరలించాలని కోరారు.

★ బాల్కొండ మండలంలో పురాతన ఖిల్లాను కాపాడాలని జిల్లా పరిరక్షణ సమితి ప్రతినిధులు కోరారు.

★ మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తున్న మాక్లూర్ కేజీబీవీ ఎస్‌వోను విధుల నుంచి

రెండు చేతుల్లేవు.. ఆసరా రాదు

ఈయన పేరు గంగారాం. రుద్రూరు మండలం చిక్కడ్‌పల్లి. రెండేళ్ల కిందట వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కోల్పోయారు. ఏ పనులు చేసుకోలేని పరిస్థితి. ఆసరా పింఛన్ మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటూనే ఉన్నారు. సదరం ధ్రువీకరణ పత్రం ఉన్నా కనికరించడం లేదని కలెక్టరేట్‌కు వచ్చిన బాధితుడు 'న్యూస్‌టుడే'తో వాపోయారు.



గంగారాం, చిక్కడ్‌పల్లి

గుంతలు.. తిప్పలు

గ్రామీణ రహదారులు ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. వానలు పడ్డాయంటే చాలు రోడ్డుపై అడుగు వేయలేని దుస్థితి. బోధన్ మండలం కొప్పర్గ-ఖండ్‌గాం మధ్య 4కి.మీ మేర గ్రామీణ పంచాయతీరాజ్ రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. ఏళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో భారీ గుంతలు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అవి మరింత పెద్దవయ్యాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కొందరు గుంతలు కనిపించక ప్రమాదాలబారిన పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ లిఖితను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. రూ.4.6 లక్షల నిధులు ఇటీవల మంజూరయ్యాయని తెలిపారు. టెండర్లు నిర్వహించి మరమ్మతులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం



అభివృద్ధి పనులకు భూమిపూజ

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నగరంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం భూమిపూజ చేశారు. 22, 23వ డివిజన్లలో సీసీ రోడ్లు, బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. . 23వ డివిజన్‌లో స్పెషల్ ఫండ్ రూ.11.5 లక్షలు, జనరల్ ఫండ్ రూ.10 లక్షలు, పట్టణప్రగతి ద్వారా రూ.10 లక్షలు నిధులతో హనుమాన్ నగర్, పద్మానగర్‌లో సీసీ రోడ్, బీటీరోడ్డు పనులకు భూమిపూజ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నగరాభివృద్ధికి రూ.100 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 23, 24వ డివిజన్లను కలిపే రోడ్ నిర్మాణానికి విశ్వశాంతి యాజమాన్యం రోజారాణి 300 గజాల స్థలం ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు మల్లేష్‌యాదవ్, పంచరెడ్డి లావణ్య, లింగం, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, లక్ష్మణ్, హరీష్ రెడ్డి, మురళి, హరీష్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.



'ప్రతిపక్ష నేతల మాటలు పట్టించుకోవద్దు'

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతిపక్ష నేతల మాటలను ప్రజలు పట్టించుకోవద్దని ఎమ్మెల్యే భూపతి రెడ్డి పేర్కొన్నారు. గుండారంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, సొసైటీ ఛైర్మన్‌లు శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి గ్రామీణం, ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లి, సిరికొండ : రాంపూర్ సొసైటీ పరిధిలోని రాంపూర్, మిట్టాపల్లి, మల్లాపూర్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్‌నాయక్ ప్రారంభించారు. ఇందల్‌వాయిలో కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి సొసైటీ పరిధిలోని మునిపల్లి, లక్ష్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ సాయారెడ్డి ప్రారంభించారు. సిరికొండలోని తూంపల్లి సొసైటీ పరిధిలోని గోప్యతండా, సర్పంచ్‌తండా, తూంపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఛైర్మన్ రాములు ప్రారంభించారు.

వసతుల కల్పనకు నిధులు వెచ్చించాలని తీర్మానం

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చించాలని పాలకవర్గం నిర్ణయించింది. సోమవారం ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి అధ్యక్షతన కార్యాలయంలో సభ్యులు సమావేశమయ్యారు. మార్కెట్ ఆదాయ, వ్యయాలను మార్కెటింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, పంట నిల్వకు అదనంగా గోదాములు, పంట పొలాలకు రహదారుల కోసం నిధులు వెచ్చించాలని తీర్మానించారు. సిబ్బంది కొరతను తీర్చేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ధాన్యం సేకరణ చేపట్టాలని రాస్తారోకో



పొతంగల్‌లో..

పొతంగల్, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం పొతంగల్ రైతులు రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పొతంగల్ విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం అవుతున్నా ఇప్పటికీ ఒక గింజ కొనుగోలు చేయలేదని రైతులు చెప్పారు. ఆరబెట్టిన ధాన్యం వర్షాలకు తడుస్తుందని, తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టేందుకు కూలీల ఖర్చులు పెరిగిపోతున్నాయని వాపోయారు. అనంతరం కొనుగోళ్లు ప్రారంభించాలని ఆర్ఐ సాయిలుకు వినతిపత్రం అందజేశారు.

నవీపేట, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భాజపా మండలాధ్యక్షుడు సరీన్ ఆధ్వర్యంలో నవీపేటలో సోమవారం ఆ పార్టీ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వరికి రూ.500 బోనస్, రైతు భరోసా, అర్హులకు రైతురుణమాఫీ అందించాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి తహసీల్దారు వెంకటరమణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు భోజన్న, వంశీమోహన్, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్, రాధ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ : దూపల్లిలో..

రెంజల్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతుందంటూ దూపల్లిలో సోమవారం రైతులు రాస్తారోకో చేపట్టారు. గంటపాటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం సహకార సంఘానికి చేరుకొని అక్కడ బైఠాయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని, లేనిపక్షంలో బోధన్-నిజామాబాద్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు గంగారెడ్డి, గోపాల్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



నవీపేట : రోడ్డుపై బైఠాయించిన భాజపా శ్రేణులు

పోలీసు అమరుల త్యాగాలే స్ఫూర్తి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల త్యాగాలే స్ఫూర్తిగా ముందుకు సాగాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు పాలనాధికారి అంకిత్ అన్నారు. జిల్లా కేంద్రం పోలీసు పరేడ్ మైదానంలో సోమవారం పోలీసు సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ప్రజల రక్షణ కోసం ఎండనక, వాననక విధులు నిర్వహిస్తారని, విధుల్లో అమరులైన వారిని స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని సైబర్ నేరస్థుల ఆట కట్టిస్తున్నారని ప్రశంసించారు. ఏడాది కాలంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి నివాళులర్పించారు. అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావు, అదనపు డీసీపీ(లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డి, ఏసీపీలు శ్రీనివాసరావు, రవీందర్‌రెడ్డి, నాగేంద్రచారి, నాగయ్య పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి, సిరికొండ ఎడపల్లి, న్యూస్‌టుడే: పోలీసులకు విధి నిర్వహణ ఎంతో బాధ్యతాయుతమైందని డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ ఇన్‌ఛార్జి కమాండెంట్ ఎం.ఐ సురేశ్ అన్నారు. డిచ్‌పల్లి బెటాలియన్‌లో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించి మాట్లాడారు. దేశ రక్షణ, ప్రజాక్షేమం కోసం పోలీసులు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అసిస్టెంట్ కమాండెంట్లు కేపీ శరత్‌కుమార్ సత్యనారాయణ, మెడికల్ అధికారిణి అనుపమా, ఏవో అయ్యావారయ్య తదితరులు పాల్గొన్నారు. సిరికొండ మండల కేంద్రంలో మానవహారం నిర్వహించారు. ఎడపల్లి ఠాణాలో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై వంశీకృష్ణ అమరవీరుల స్తూపం చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు.

ఆగని నీటి వృథా

ఖండ్‌గాంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పంచాయతీ బోరు మోటారు నీరు వృథాగా పోతోంది. నీటి సరఫరాకు నిర్ణీత సమయపాలన లేకపోవడంతో నీటితో పాటు విద్యుత్తు సైతం వృథా అవుతోంది. నియంత్రించడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టిసారించి ఇంధనం, నీటిని పొదుపుగా వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం



ఎడపల్లిలో బంద్ ప్రశాంతం

ఎడపల్లి: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేయడంతో పాటు హిందూ సంఘాల నాయకులపై జరిగిన లాఠీఛార్జికి నిరసనగా సోమవారం ఎడపల్లిలో తలపెట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు హిందూ సంఘాల నాయకులు సంఘ విద్రోహ శక్తుల దిష్టిబొమ్మ దహనంచేశారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. నాయకులు రాంచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఎడపల్లి: అంబం గ్రామానికి చెందిన నర్సవ్వ (55) అనే మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వారం కిందట ఇంట్లో నుంచి వెళ్లిన నర్సవ్వ తిరిగి రాలేదన్నారు. సోమవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్సై వివరించారు.

అయోడిన్ లోపంతో అనర్థాలు

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: అయోడిన్ లోపంతో అనేక అనర్థాలుంటాయని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రాం అధికారి డా.రాజు పేర్కొన్నారు. నగరంలోని అర్సపల్లి, మాలాపల్లి ఆరోగ్య కేంద్రాల్లో అయోడిన్ లోప నివారణ దినోత్సవం నిర్వహించారు. డా.ఆజ్మతున్నీసాబేగం, డా.గంగాదినేష్, హెచ్ఈ వెంకటేశ్వర్లు, శశికళ, కవిత తదితరులు ఉన్నారు.

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: తిర్మన్‌పల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అయోడిన్‌లోప నివారణపై మండల ఆరోగ్య విస్తరణాధికారి శంకర్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ పద్మ తదితరులు ఉన్నారు.

చేపపిల్లల పంపిణీ

రెంజల్: రెంజల్ మండలంలోని మత్స్యకారులకు అధికారులు, నాయకులు సోమవారం చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. చేపపిల్లల పెంపకంతో జీవనోపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీఏ ఆంజనేయస్వామి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఇతర నాయకులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



గిరిరాజ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మెప్మా ప్రతినిధులు, సంఘ సభ్యులు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: మెప్మా ఆధ్వర్యంలో స్థానిక గిరిరాజ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎంసీ మాధురి సోమవారం ప్రారంభించారు. శ్రీరామ గౌతమి ఎస్ఎల్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ కేంద్రం పని చేస్తోంది. కార్యక్రమంలో టీఎంసీ శోభారాణి, సమాఖ్య అధ్యక్షురాలు శోభ, సభ్యులు లక్ష్మి, శివ లక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

చందూర్ : మోస్రాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మోస్రా సొసైటీ ఛైర్మన్ జగన్మోహన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. రైతులు వానాకాలం పండించిన వరిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : పరిసరాల శుభ్రత ఎంతో ముఖ్యమని, ఇంటి చుట్టూ నీరు నిల్వకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ సూచించారు. సోమవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానాతో పాటు పాన్‌గల్లీలోని బస్తీ దవాఖానాను ఆయన సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. వారికి సూచనలు చేశారు. రాకాసిపేటలోని దవాఖానాలో ఏఎన్ఎం, పర్యవేక్షకులు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఉప వైద్యాధికారి సమత, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సహారా ఆధ్వర్యంలో కంఠేశ్వర్‌లోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో క్యాన్సర్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి గుర్తించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సపై వైద్యుడు రవీంద్రనాథ్ సూరి వివరించారు. జిల్లా కార్యదర్శి ఉదయ సూర్యభగవాన్, క్లబ్ అధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల సదస్సులో ప్రసంగం

నిజామాబాద్ నగరం : ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ దక్షిణాది రాష్ట్రాల మానసిక వైద్యుల వార్షిక మహాసభలు బెంగళూరులో నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా నుంచి ప్రభుత్వ వైద్యకళాశాల వైద్యుడు డా.విశాల్ హాజరై ప్రసంగించారు. ఈ సభలు సోమవారం ముగిశాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ మెంటల్ హెల్త్, న్యూరోసైన్స్ ఆధ్వర్యంలో వీటిని నిర్వహించినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న డా.విశాల్

సీపీఎం నగర కమిటీ ఎన్నిక

ఖలీల్‌వాడి : సీపీఎం నగర కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సుజాత, కార్యవర్గ సభ్యులుగా నర్సయ్య, రాములు, అనిత, అనసూయ, నవీన్, దీపిక ఎన్నికయ్యారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఖలీల్‌వాడి : మానసిక, దివ్యాంగ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ పేర్కొన్నారు. సోమవారం స్నేహ సొసైటీలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణుడు రవితేజ, సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన బీసీ సంక్షేమాధికారిణి

నిజామాబాద్ కలెక్టరేట్ : బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి సోమవారం తిరిగి విధుల్లో చేరారు. గత కొన్ని రోజుల నుంచి ఆమె వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లడంతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించగా వారి నుంచి స్రవంతి బాధ్యతలు తీసుకున్నారు.

ఆకస్మిక తనిఖీ

నిజామాబాద్ నగరం : నగరంలోని పలు హోటళ్లను నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న వంటగదులు పరిశీలించి జరిమానాలు విధించారు. ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.

బూట్ల పంపిణీ

జక్రాన్‌పల్లి : లక్ష్మాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు రూ.25వేల విలువైన బూట్లను మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ సాయారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. నాయకులు చిన్న సాయిరెడ్డి, కైలాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నిజామాబాద్ గ్రామీణం: రూరల్ ఠాణా పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఠాణా ఎస్‌హెచ్‌వో మహమ్మద్ ఆరిఫ్ పేర్కొన్నారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు వద్ద గంగాస్థాన్ వైపు రోడ్డు దాటుతుండగా ఆర్మూర్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. చనిపోయిన వ్యక్తి యాచక వృత్తి చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు కిందపడి ఉపాధ్యాయుడి ఆత్మహత్య

నిజామాబాద్ నేరవిభాగం : సిర్నపల్లి - ఉప్పలవాయి మధ్య ఆదివారం రాత్రి గూడ్స్ రైలు కిందపడి ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన వినయ్‌కుమార్(40)గా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు.

మనస్తాపానికి గురై దర్జీ..

వర్ని: మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం వెలుగు చూసింది. ఎస్సై కృష్ణకుమార్ కథనం ప్రకారం.. చందూర్‌కు చెందిన సంజీవ్‌కుమార్ (45) దర్జీ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవారు. 20 ఏళ్ల కిందటే భార్య, పిల్లలను వదిలిన ఆయన ఒంటరిజీవనం గడిపేవారు. ఒంటరితనంతో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి కిరాయి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గోదావరిలో ఒకరి గల్లంతు

రెంజల్ : కందకుర్తి గోదావరిలో కుటుంబంతో కలిసి స్నానానికి వచ్చిన వ్యక్తి గల్లంతైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బోధన్‌కు చెందిన మాధవ్ (38) అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి సోమవారం కందకుర్తి స్నానఘట్టాలకు వచ్చి నదిలో దిగి గల్లంతయ్యారు. ఒడ్డుపై దుస్తులు వదిలి స్నానానికి వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: పోలీసుల తనిఖీల్లో డిటోనేటర్లతో పట్టుబడిన గండికోట మల్లయ్యకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు జిల్లా జడ్జి టి.శ్రీనివాస్ సోమవారం తీర్పునిచ్చారు. 2014 మే 11న భీమ్‌గల్ పోలీసులు భీమ్‌గల్ పట్టణంలో వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాక్టర్‌లో 200 డిటోనేటర్ వైర్లు లభించడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరిపారు. పోలీసుల తరఫున అదనపు కోర్టు పి.పి. బంటు వసంత్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి శిక్ష విధించారు.

ఇద్దరికి ఒకరోజు..

బోధన్ గ్రామీణం: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శేషతల్పసాయి ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ.వేయి జరిమానా విధించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. మరో కేసులో డయల్100కు కాల్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసిన వ్యక్తికి న్యాయమూర్తి ఒక రోజు జైలుశిక్ష విధించారని సీఐ వెల్లడించారు.

రూ.కోటి విలువైన గంజాయి దహనం

ఎదులాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ రూ.కోటి విలువ గల 411 కిలోల గంజాయిని నిజామాబాద్ జిల్లాలోని శ్రీమెడికేర్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్‌లో సోమవారం దహనం చేశారు. ఉట్నూరు, ఇచ్చోడ, ఆదిలాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడ్డ గంజాయిని ఉన్నతాధికారుల ఆదేశాలతో నిజామాబాద్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో కాల్చివేశారు. ఆదిలాబాద్ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఒకరికి రెండు రోజులు..

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మూడో ఠాణా పరిధిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. నగరంలోని హమాల్‌వాడికి చెందిన రమేశ్(52) తన తమ్ముడి భార్యతో గొడవపడ్డాడు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి సోమవారం కోర్టు ఎదుట హాజరు పరచగా మెజిస్ట్రేట్ శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం: నగరంలోని అర్సపల్లిలో జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.44,850 నగదు, ఏడు చరవాణులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు.

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నాలుగో ఠాణా పరిధిలో జూద స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. మహాలక్ష్మినగర్‌లో జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.72,470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో శ్రీకాంత్ తెలిపారు.

మొరం టిప్పర్ పట్టివేత

మోపాల్, న్యూస్‌టుడే: మోపాల్ మండలం నుంచి అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను భూగర్భ గనుల శాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. వాహనాన్ని మోపాల్ ఠాణాలో అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్ చెప్పారు.

ఆర్మూర్
● ఆర్మూర్ ● బాల్కొండ

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శంకర్‌గౌడ్ రాష్ట్రస్థాయి కబడ్డీ (అండర్-17) విభాగం పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా క్రీడా అథారిటీ మైదానంలో ఉమ్మడి జిల్లా పోటీల్లో ప్రతిభ కనబర్చారు. నవంబరు 3 నుంచి 5వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు నరేందర్, పీడీ రాజేష్ సోమవారం పాఠశాలలో అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యపై సర్కారు ప్రత్యేక దృష్టి

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు కల్పిస్తుందని కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన సోమవారం సందర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే పాఠశాలలో ఆహారం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.


భీమ్‌గల్ కేజీబీవీలో పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

సందర్శించి.. హెచ్చరించి


దస్త్రాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ సోమవారం తనిఖీ చేశారు. పలు దస్త్రాలు పరిశీలించారు. డెంగీ బారిన పడిన వారి వివరాలు సేకరించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్ అనిల్ విధులకు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిత్యం అందుబాటులో ఉంటూ రోగులకు సేవచేస్తున్న ఆయుష్ అధికారిణి వరలక్ష్మి, ఇతర సిబ్బందిని అభినందించారు. మందుల సరఫరా ఎలా ఉందనే విషయమై ఆరా తీశారు.

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ నవనాథ సిద్ధులగుట్టపై భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ తహసీల్దార్ గజానంద్ కుటుంబ సభ్యులతో కలిసి శివాలయం, రామాలయంలో పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో స్వామివారి పల్లకీసేవ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సుమన్, గంగారెడ్డి, మల్లయ్య, చరణ్‌రెడ్డి, రవి, సంధ్య, శంకర్, శ్రీనివాస్, ప్రశాంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

కుక్కలు పట్టి.. కు.నికి తరలించి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణవ్యాప్తంగా వీధి కుక్కల బెడద తీర్చేందుకు బల్దియా అధికారులు రంగం సిద్ధం చేశారు. వాటిని సురక్షితంగా పట్టి జిల్లా కేంద్రంలోని కు.ని కేంద్రానికి తరలించనున్నారు. శస్త్రచికిత్స అనంతరం నిబంధనల ప్రకారం పట్టినచోటనే వదిలేందుకు ఒప్పందం చేసుకొన్నారు. కాగా ఈ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. పుర ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య 23 వార్డులో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందికి పట్టణవాసులు సహకరించాలని కోరారు. వెంట నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, లింబాద్రిగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి సిబ్బంది ఉన్నారు.


పరిశీలిస్తున్న బల్దియా ప్రజాప్రతినిధులు, అధికారులు

అతివకు ఆర్థిక భరోసా..!

● మహిళా శక్తి క్యాంటీన్ల విస్తరణకు కసరత్తు
● ఆర్మూర్ బల్దియాలో మరికొన్ని ఏర్పాటు

అతివల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సర్కారు చొరవ తీసుకుంటోంది. సొంత కాళ్ల మీద నిలబడి.. కుటుంబానికి అండగా నిలిచేలా కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉపాధి చూపేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను మంజూరు చేస్తోంది. ఆర్మూర్ పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో గత నెల ప్రారంభించగా లాభాల్లో కొనసాగుతోంది. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల వద్ద సేవలు విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనూ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అతివలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని, స్వయం ఉపాధి పొందాలని సూచిస్తున్నారు.

న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

తక్కువకే విక్రయం..


ఆర్మూర్ పుర కార్యాలయంలో క్యాంటీన్ ప్రారంభించిన ఛైర్‌పర్సన్ లావణ్య(పాతచిత్రం)

సాధారణంగా బయటి దుకాణాల్లో ఉండే ధరల కంటే రూ.5 తక్కువగా విక్రయించేందుకు నిర్వాహకులు ముందుకు వచ్చారు. వీటిని మరింత అభివృద్ధి చేసేందుకు మెప్మా ఆధ్వర్యంలో అవసరమైన బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆహారశాల నిర్వహణకు ఉచితంగా స్థలం కేటాయించడంతో వీటిని ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో రుణాలు

మహిళా సంఘాల సభ్యులకు మెప్మా ఆధ్వర్యంలో రుణం అందించడం ద్వారా ఉపాధి రంగంలో ముందుకెళ్తున్నారు. క్యాంటీన్ల ఏర్పాటుతో స్థానికంగా నాలుగు నుంచి ఐదుగురికి ఉపాధి లభిస్తోంది. సమాఖ్యల ద్వారా రుణం తీసుకున్న సభ్యులు స్వయం ఉపాధి పొందుతున్నారు. నిత్యం పలు పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాల కోసం పట్టణానికి వచ్చే ప్రజలకు వెసులుబాటు కలగనుంది. పిండి వంటలు, అల్పాహారం, ఆహార పదార్థాలు, తెలంగాణ వంటకాలు ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయి.

నాలుగు రోజుల్లో ఇంకోటి

మెప్మా ఆధ్వర్యంలో ఆర్మూర్ పురపాలక సంఘం కార్యాలయంలో క్యాంటీన్ ప్రారంభించాం. వీటిని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించాం. బల్దియా ఆవరణలో జర్నలిస్టు కాలనీకి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేశారు. మరో మూడు, నాలుగు రోజుల్లో ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనూ ఏర్పాటు చేయనున్నాం. **- రాజు, పుర కమిషనర్, ఆర్మూర్**

ప్రజలు ప్రోత్సహించాలి

మహిళా సంఘాల ద్వారా సభ్యుల అతివల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. మహిళా శక్తి క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం, పిండి వంటలు అందిస్తున్నారు. ప్రజలు వీటిని ఆదరించి, ప్రోత్సహించాలి. స్త్రీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **లావణ్య, పుర ఛైర్‌పర్సన్**

చిరుతపులి కాదు.. అడవిపిల్లి

మాక్లూర్, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా పంట పొలాల్లో, అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుందని గద్వాలక్యాంపు వాసులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై అటవీ అధికారులకు తెలిపి రక్షణ కల్పించాలంటూ వేడుకున్నారు. సోమవారం అటవీశాఖ డిప్యూటీ రేంజర్ అశోక్‌కుమార్, బీట్ ఆఫీసర్ ప్రగతి, మండల పశు వైద్యాధికారి ఉమామసహేర్ సిబ్బందితో పంట చేలల్లో పర్యటించారు. నాలుగు అడవిపిల్లులు కనిపించాయన్నారు. చిరుత సంచారం లేదని భయాందోళనకు గురికావద్దని ప్రజలకు తెలియజేశారు.



వర్షం.. తడిసిన ధాన్యం

వేల్పూర్‌లో సోమవారం కురిసిన వర్షానికి రైతులు ఎండబెట్టిన ధాన్యం తడిసింది. వరి పంట కోత దశలో కురుస్తున్న వర్షాలకు ధాన్యం ఆరబెట్టలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేల తడిగా ఉండడం, వర్షం కురవడంతో ధాన్యానికి మొలకలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, వేల్పూర్**


వేల్పూర్‌లో ధాన్యంపై కప్పిన పాలిథిన్ కవర్లు

అవీ...ఇవీ.. అన్నీ

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూర్ మండలం దేగాం గురడిరెడ్డి కాపు సంఘం ప్రతినిధులు సోమవారం ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామంలోని సంఘం భవనం గోడను ఆనుకొని ఉన్న గ్రామ పంచాయతీ స్థలంలోని కొద్ది భాగాన్ని ఒకరు ఆక్రమించుకొని నిర్మాణం చేపట్టినట్లు డీఎల్పీవో, ఎంపీడీవోలకు గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మంగళవారం సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.



పోషకాహారంపై అవగాహన

భీమ్‌గల్ గ్రామీణం: మండలకేంద్రంలో భీమ్‌గల్, వేల్పూర్ మండలాల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై సోమవారం తరగతులు నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు మాట్లాడుతూ.. వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని చిన్నారులకు పోషకాహారం అందిస్తూ సాధారణ పరిస్థితికి వచ్చేలా చూడాలన్నారు. గర్భిణులకు పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రశాంత్, సీడీపీవో స్వర్ణలత, ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్లు శ్రీదేవి, అరుణకుమారి, ఉషారాణి, మంజుల తదితరులున్నారు.

ఎల్వోసీ మంజూరు

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లికొండకు ఏన్పోతుల హన్మాయి, మెండోరా మండలం కొడిచెర్లకు చెందిన పెద్దరాజన్న అనారోగ్యానికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం స్థానిక నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా చికిత్స కోసం ఎల్వోసీలు మంజూరు చేయించారు. బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

మాక్లూర్ గ్రామీణం: కల్లెడ గ్రామంలో మూడేళ్ల కిందట సర్పంచి లేకపోవడంతో గ్రామ ప్రత్యేకాధికారిగా ఉన్న అధికారి శ్రీనివాస్ పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నట్లు గ్రామస్థులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్యశిబిరానికి స్పందన

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో క్రిబ్‌కో సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యాధికారి నరసింహస్వామి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీడీవో రాజశ్రీనివాసు, సొసైటీ ఛైర్మన్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో అనిల్ ఈరవత్రి

బాల్కొండ, న్యూస్‌టుడే : కాంగ్రెస్ మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు షేక్ జావిద్ పుట్టిన రోజు వేడుకల్లో సోమవారం రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ పాల్గొన్నారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి కేకు తినిపించారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముత్యంరెడ్డి, డైరెక్టర్ ఇమ్రాన్‌ఖాన్, వెంకటేష్, గడ్డం రవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


పశువైద్యాధికారి శ్రీకాంత్

నందిపేట్, న్యూస్‌టుడే: డొంకేశ్వర్ మండల పశువైద్యాధికారిగా ఎర్ర శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశువులకు నాణ్యమైన సేవలు అందిస్తానని ఆయన తెలిపారు. సిబ్బంది, ధర్మాజి, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అదనపు కలెక్టర్ విచారణ

మాక్లూర్: మాక్లూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) సోమవారం సాయంత్రం అదనపు కలెక్టర్ అంకిత్ విచారణ నిర్వహించారు. సిబ్బందితో విడివిడిగా మాట్లాడారు. మాయమైన బంగారు గొలుసు కోసం మంత్రగాడి వద్దకు విద్యార్థినిని తీసుకెళ్లిన ఘటనపై ఆరాతీశారు. ఉపాధ్యాయురాలు మూఢ నమ్మకాల బాట పట్టడం, సిబ్బంది మధ్య నెలకొన్న వివాదాల పట్ల విస్తుపోయారు. ఆయన వెంట జీసీడీవో భాగ్యలత, మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ తదితరులున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

మాక్లూర్ గ్రామీణం: ప్రభుత్వ బడుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో సత్యనారాయణ, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని అన్ని మండలాలకు ఎంఈవోలను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను మానిక్‌బండార్ పాఠశాలలో ప్రారంభించారు.

దరఖాస్తు పత్రాల పంపిణీ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను సోమవారం ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు పంపిణీ చేశారు. పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అధ్యక్షుడు నర్సయ్య, న్యాయవాదులు జెస్సు అనిల్, అరుణ్‌కుమార్, కిష్టన్న, పోచన్న, అమితాబ్ కిరాడ్, అశోక్, జీజీ రాం, రమేశ్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌కు చెందిన పోతు నాగరాజు అనారోగ్యంతో బాధపడుతుండడంతో సునీల్‌రెడ్డి స్పందించి రూ.5 వేల నగదు పంపించారు. వాటిని కాంగ్రెస్ నాయకులు సోమవారం బాధితుడికి అందించారు. రవీందర్, గంగారెడ్డి, రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు.. పిడుగులు

☛ క్రీడల్లో సత్తా చాటుతున్న గ్రామీణ విద్యార్థులు

గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటుతున్నారు.. ప్రభుత్వ బడుల్లో చదువుతూ.. వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో నిత్యం సాధన చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికవుతూ పతకాలు కొల్లగొడుతున్నారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ఎంపికవుతున్న తీరుపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

వాలీబాల్‌లో మెరికలు

ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో బాలుర విభాగంలో జస్వంత్, బాలికల విభాగంలో హిమతేజ, శ్రీనిధి, స్పందన సత్తాచాటారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పోటీలకు సిద్ధమయ్యారు. పతకాలు సాధిస్తామని విద్యార్థులు పేర్కొంటున్నారు. **- న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం**


విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు హరిత, పీడీ మధు తదితరులు

భళా బాలికలు


విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భీమ్‌గల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికల)కు చెందిన 10వ తరగతి విద్యార్థినులు ఎన్.వాణి, శరణ్యలు అండర్ 17 క్రీడల్లో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. నిజామాబాద్‌లో జరిగిన పోటీల్లో సత్తాచాటారు. మండల విద్యాశాఖాధికారి డి.స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుల మన్ననలు పొందారు. బాలురతో పోలిస్తే తామేమీ తక్కువ కాదని చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, భీమ్‌గల్ గ్రామీణం**

బంగారు దివ్యశ్రీ

ఆర్మూర్ కస్తూర్బా విద్యాలయం విద్యార్థిని దివ్యశ్రీ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు వరంగల్ జిల్లాలో జరిగిన 9వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల ఛాంపియన్‌షిప్‌లో జిల్లా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. దివ్యశ్రీని పాఠశాల ప్రత్యేకాధికారిణి గంగామణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీణ సోమవారం అభినందించారు. **- న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం**


దివ్యశ్రీకి ప్రశంసాపత్రం అందిస్తున్న కేజీబీవీ ప్రత్యేక అధికారిణి గంగామణి

కబడ్డీలో ఆదిల్


ఆదిల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

బషీరాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆదిల్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. నిత్యం సాధన చేస్తున్నానని విద్యార్థి చెబుతున్నాడు. క్రీడా కోటాలో కొలువు సాధిస్తానని పేర్కొంటున్నాడు. **- న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి**

12 గేట్లెత్తి.. 37,488 క్యూసెక్కులు వదిలి

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: ఎస్సారెస్పీ నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోందని ఏఈఈ కొత్త రవి తెలిపారు. సోమవారం ఉదయం 67,562 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 17 గేట్లెత్తి 67,562 క్యూసెక్కులు గోదావరిలోకి వదిలేశామన్నారు. మధ్యాహ్నం 51,942 క్యూసెక్కులకు తగ్గడంతో 12 గేట్లకు తగ్గించి 37,488 క్యూసెక్కులు వదులుతున్నట్లు చెప్పారు. కాకతీయ కాల్వకు 4000, ఎస్కేప్ గేట్ల ద్వారా 4000, వరద కాల్వకు 5000, లక్ష్మికి 150, సరస్వతికి 500, భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక నేడు

నందిపేట్: నూత్‌పల్లి విద్యుత్తు ఉపకేంద్రంలో మంగళవారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఏడీఈ అశోక్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డొంకేశ్వర్, నందిపేట్, మాక్లూర్ మండలాల్లోని వినియోగదారులకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


తూకం వేస్తున్న సొసైటీ ఛైర్మన్ బూరోళ్ల అశోక్

మాక్లూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మాక్లూర్ మండలం కల్లెడ, రాంచంద్రపల్లి గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ ఛైర్మన్ బూరోళ్ల అశోక్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పండించిన పంటను సొసైటీల్లోనే విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శేఖర్, రమేశ్, పోశెట్టి, గంగారాం, సుధాకర్, మహేశ్ పాల్గొన్నారు.

నందిపేట్, న్యూస్‌టుడే: కుద్వాన్‌పూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ వాకిడి కార్తిక్‌రెడ్డి, ప్రారంభించారు. సొసైటీ సీఈవో చిన్నయ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్ గ్రామీణం: ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆలూర్, దేగాం, మచ్చర్ల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ ఛైర్మన్ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చేపూర్ రాజేశ్వర్, ఆలూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్, మాజీ సర్పంచి, ఉప సర్పంచి కళ్లెం మోహన్, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం, సంఘం డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: పచ్చలనడ్కుడలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని విండో ఛైర్మన్ లింబారెడ్డి ప్రారంభించారు. డైరెక్టర్లు నర్సారెడ్డి, శేఖర్, మల్లేష్, రామన్న, గంగాధర్, నాయకులు రమేష్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పచ్చలనడ్కుడలో..

ఈనాడు సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)
స్క్రీన్-1 జిగ్రా: 11.30, 5.40 మా నాన్న సూపర్ హీరో: 2.50 మార్టిన్: 9.00
స్క్రీన్-2 దేవర: 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 వేట్టయాన్ ది హంటర్ 11.50, 3.20, 6.50, 10.20
స్క్రీన్-4 విశ్వం: 10.00, 4.15, 10.30 జనక అయితే గనక: 1.15. 7.30
న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

సమస్య: పట్టణంలోని పెర్కిట్ చౌరస్తాలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం కంచె చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విగ్రహం కనిపించని పరిస్థితి ఏర్పడింది. వాటిని తొలగించాలి.
- మహమ్మద్ నయిూమొద్దీన్, పెర్కిట్

సమాధానం: సిబ్బందిని పంపించి ఫ్లెక్సీలు తొలగింపజేస్తా.
- రాజు, మున్సిపల్ కమిషనర్ (ఆర్మూర్)

– న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం